మహిళల భద్రత కోసమే షీటీం

జైపూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మహిళల భద్రత కోసమే షీటీంను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని జిల్లా షీ టీం ఎస్‌ఐ హైమా, రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ వరలక్ష్మీ పేర్కొన్నారు. శనివారం మండలంలోని టేకుమట్ల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో బాలిక సాధికారత కార్యక్రమంపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు చట్టాల గురించి, ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆకతాయిలు ఎవరైనా వేధిస్తే తల్లిదండ్రులకు కానీ, ఉపాధ్యాయులకు కానీ తెలియజేయాలన్నారు. విద్యార్థినుల ఆరోగ్యం, భద్రత తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చెన్నూరులో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్

చెన్నూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి శనివారం ఉదయం పట్టణంలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానానికి వచ్చిన క్రీడాకారులు, వాకర్స్, పట్టణ ప్రజలు మైదానంలో నెలకొని ఉన్న సమస్యల గూర్చి ఆయనకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం మహాత్మజ్యోతి బాపూలే గురుకుల పాఠశాలను సందర్శించారు. గురుకులంలోని సమస్యలను విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గురుకుల పాఠశాలకు క్రీడామైదానం, ప్రహరీ నిర్మాణం గూర్చి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం చేస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంట ఉన్నారు.

ట్రస్మా కోశాధికారిని పరామర్శించిన ఎమ్మెల్యే

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా ట్రస్మా కోశాధికారి విష్ణువర్ధన్‌రావును ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పరామర్శించారు. విష్ణువర్ధన్‌రావు కాలుకు సర్జరీ కావడంతో ఆయన నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ట్రస్మా సభ్యులు ఉడారి చంద్రమౌళి, బాలాజీ, రమణ, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధుల కటకట

- 'స్థానిక' ఎన్నికలతో కేంద్రం లంకె
- పైసా విదల్చని రాష్ట్ర ప్రభుత్వం
- సొంత గ్రాంటు విడుదలకూ కలగని మోక్షం
- జేబుల్లో నుంచి చెల్లించేందుకు కార్యదర్శుల నిరాకరణ



మంచిర్యాల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : నిధుల కొరత కారణంగా గ్రామాల్లో సమస్యలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. ఇంతకాలం చిన్న చిన్న ఖర్చులు జేబుల్లో నుంచి వెచ్చించిన పంచాయతీ కార్యదర్శులు.. ఇక తమ వల్ల కాదంటూ చేతులెత్తేశారు. ఫలితంగా గ్రామాల్లో వీధి దీపాలు వెలుగకపోయిన, బోరు పని చేయకపోయిన, ట్రాక్టర్లలో డీజిల్ లేకపోయిన వాటి ఫలితం ప్రజలు అనుభవించక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ఇంతకాలం కార్యదర్శులు సొంతంగా వెచ్చించిన ఖర్చులు తిరిగి రాకపోగా, నగదు చెల్లించకుండా సామగ్రిని ఇచ్చేందుకు షా పుల నిర్వాహకులు నిరాకరిస్తుండడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచి పోయే పరిస్థితులు నెలకొన్నాయి.

15వ ఆర్థిక సంఘం నిధులు ఇవ్వని కేంద్రం...

ప్రతి గ్రామ పంచాయతీకి కేంద్ర ప్రభుత్వం అభివృద్ధికోసం నిధులు మంజూరు చేస్తుంది. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కావాల్సి ఉంది. పంచాయతీల్లో పాలక వర్గాలు లేనందున నిధులు విడుదల చేయలేమంటూ కేంద్రం చేతులెత్తేసింది. సకాలంలో రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించి ఉంటే కేంద్రం నిధులు సక్రమంగా విడుదలై ఉండేవి. పంచాయతీ పాలక వర్గాల గడువు ముగిసి దాదాపు రెండేళ్ల గడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడంలో తాత్సారం చేస్తోంది. పంచాయతీల పాలక వర్గాల గడువు ముగిసిన తరువాత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు వచ్చాయి. ప్రస్తుతం పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్ర క్రియ జరుగుతుండడంతో పంచాయతీ ఎన్నికల నిర్వహణ జరుగలేదు. దీంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులకు ఆటంకం ఏర్పడింది.

పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తేనే ఫండ్ రిలీజ్ చేస్తామని కేంద్రం లంకె పెట్టడంతో ఆ నిధులపై ఆశలు వదులు కోవాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా స్టేట్ ఫైనాన్స్ కమిషన్ (ఎస్ఎఫ్‌సీ) కింద రాష్ట్ర ప్రభుత్వం విడు దల చేయాల్సిన ఫండ్ కూడా రాకపోవడంతో గ్రామాల్లో నిధుల కొరత తీవ్ర రూపం దాల్చింది. కేంద్ర గ్రాంట్ 2024 ఆగస్టు నుంచి నిలిచిపోగా, రాష్ట్ర ప్రభుత్వ నిధులు 2023 ఆగస్టు నుంచి నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా గ్రామ జనాభాలోని తలా ఒక్కంటికి రూ. 108 చొప్పున విడుదల చేయాల్సి ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచే స్టేట్ ఫైనాన్స్ నిధులు నిలిచిపోగా, కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే దారిలో పయనిస్తోంది.

జనరల్ ఫండ్ విడుదలకూ అడ్డంకి...

గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు నిలిపివేయగా సొంతంగా జమ చేసుకున్న ఫండ్‌ను కూడ వినియోగించుకోలేని దీనమైన పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామాల్లో వసూలు చేసే ఇంటి పన్నును కార్యదర్శులు ట్రెజరీ కార్యాలయాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తారు. ఆ నిధులను అవసరమైనప్పుడు కార్యదర్శులు చెక్కులు డిపాజిట్ చేయడం ద్వారా తిరిగి డ్రా చేస్తారు. జిల్లా వ్యాప్తంగా 311 గ్రామ పంచాయతీలు (పాత లెక్క) ఉండగా, ట్రెజరీలలో పంచాయతీ కార్యదర్శులు జమ చేసిన మొత్తం సుమారు రూ.3 కోట్ల వరకు ఉంటుం దని అంచనా. ఆ నిధులను కార్యదర్శులు డ్రా చేసి గ్రామాల్లో అవసరమైన వాటికి ఉపయోగిస్తారు. ఆరు నెలలుగా అంటే ఆగస్టు 2024 నుంచి జనరల్ ఫండ్ నిధులు కూడా విడుదల కావడం లేదని పలువురు పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. గ్రామాల్లో వివిధ పనులు చేపట్టేందుకు అవసరమైన డబ్బుల కోసం చెక్కులు డిపాజిట్ చేస్తే పాస్ కావడం లేదని చెబుతున్నారు.

ఓ వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోగా, మరోవైపు తాము వసూలు చేసి డిపాజిట్ చేసిన సొమ్ము ఫ్రీజ్ కావ డంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో గ్రామ అవసరాల నిమిత్తం పంచాయతీ కార్యదర్శులు సొంతంగా జేబుల్లోనుంచి వెచ్చిస్తున్నారు. మరి కొంత దుకాణాల్లో ఖాతాలు పెట్టడం ద్వారా నెట్టుకొస్తున్నారు. గ్రామ అవసరాల కోసం జిల్లా వ్యాప్తంగా కార్యదర్శులు ఇప్పటికే సుమారు రూ. లక్ష వరకు వెచ్చించినట్లు తెలుస్తోంది. ఇక మీదట సొంతగా చెల్లించే స్తోమత తమకు లేదనే అభి ప్రాయంలో ఉన్న కార్యదర్శులు పంచాయతీల నిర్వహణ చేపట్టడానికి నిరాకరిస్తున్నట్లు సమాచారం.

నిధుల విడుదలకు వినతి...

గ్రామ పంచాయతీల్లో ఆగస్టు నుంచి పెండింగ్‌లో ఉన్న చెక్కుల చెల్లింపులతో పాటు వివిధ పనుల నిర్వహణ కోసం నిధులు విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 19న తెలంగాణ పంచాయత్ సెక్రటరీస్ ఫోరం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ శ్రీజనకు వినతి పత్రం అందజేశారు. పంచాయతీల్లో.. (మిగతా 7లో)



పంచాయతీరాజ్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్యదర్శులు(ఫైల్)

'రైల్వేస్టేషన్ సమస్యలు పరిష్కరించండి'



ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు పలువురు నాయకులు వినతి పత్రం అందించారు. రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫారంల వద్ద మరుగుదొడ్లను నిర్మించాలని, మూడో ఫ్లాట్‌ఫారంను ఆధునీకరించాలన్నారు. అలాగే బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో పలు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు స్టాప్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఎక్స్‌ప్రెస్ రైల్లు ఆగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునిమంద రమేష్, చంద్రశేఖర్, చిట్యాల మధు, ఎలిగేటి శ్రీనివాస్, భూపెల్లి రాజేశ్వర్, లక్ష్మణ్, శ్రీనివాస్, రాజేష్‌లు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



సీతారాంపల్లి గోదావరి పుష్కర ఘాట్ వద్ద పనులను పరిశీలిస్తున్న అధికారులు

నస్పూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : సీతారాంపల్లి గోదావరినది వద్ద మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాట్లను అధికార యంత్రాంగం శనివారం సాయంత్రం పరిశీలించింది. తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్‌లు పుష్కర ఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఉదయం మున్సిపల్ ఏఈ మధు, ఎస్సై సుగుణాకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ వేణులు పరిశీలించారు. పుష్కర ఘాట్ వద్ద షవర్లు ఏర్పాటు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాటు చేసిన గదులను శుభ్రం చేయించారు. సీసీసీ కార్నర్ వద్ద నుంచి పుష్కర ఘాట్ వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, పరిసర ప్రాంతాలు చెత్త చెదారం లేకుండా శుభ్రం చేయించారు. లైట్ల ఏర్పాటుతో పాటు వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వచ్చే భక్తులకు మంచినీటి సౌకర్యం, వైద్య శిబిరాల ఏర్పాటు చర్చించారు. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో 5వ తరగతితో పాటు 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు ఆదివారం ప్రవేశపరీక్ష (టీజీసెట్) నిర్వహిస్తున్నట్లు గురుకులం జోనల్ అధి కారిణి అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ప్రవేశం కోసం 340మంది విద్యార్థులు అదే విధంగా 6నుంచి తొమ్మిదవ తరగతి వరకు 340మంది మొత్తం 680మంది పరీక్ష రాసేందుకు సౌకర్యాలను సిద్ధం చేశామన్నారు. ఉదయం 11గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుందని గంట ముందు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. హాల్‌టికెట్‌తో పాటు ప్యాడ్, రెడ్, బ్లూపెన్స్ మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని, పరీక్ష నిర్వహణ కోసం కేంద్రాల్లో పలువురు చీఫ్ సూపరింటెండెంట్లను, డిపార్టుమెంట్ ఆఫీసర్లను, నోడల్ ఆఫీసర్లను ఏర్పాటు చేసినట్లు పకడ్బందీగా పరీక్షలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆమె ప్రకటనలో పేర్కొన్నారు.

హెచ్చరిక బోర్డు తొలగించిన అక్రమార్కులు

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తహసీల్దార్

చెన్నూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని 863 సర్వే నంబరులో రెండు రోజుల క్రితం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయగా, శనివారం వేకువ జామున అక్రమార్కులు ఆ బోర్డును తొలగించారు. ఈ విషయంపై తహసీల్దార్ మల్లికార్జున్ శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు తహసీల్దార్ మల్లిఖార్జున్ రెండు రోజుల క్రితం ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ అక్రమార్కులు హెచ్చరిక బోర్డును తొలగించడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై తహసీల్దార్‌ను సంప్రదించగా శుక్రవారం అర్ధరాత్రి అక్రమార్కులు ఆ బోర్డును తొలగించారన్నారు. ఈ విషయంపై చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

తెలంగాణాలో టీడీపీకి పూర్వ వైభవం



సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు సంపత్

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో టీడీపీకి తిరిగి పూర్వ వైభవం రానుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వాసాల సంపత్ తెలిపారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజల్లో ఎండగడతామని తెలిపారు. అంతే కాకుండా ప్రజా సమస్యల సాధన కోసం పోరాటాలు చేస్తామని తెలిపారు. త్వరలోనే తెలంగాణాలో టీటీడీపీ బలోపేతానికి సంబంధించి కూటమి నాయకులు రానున్నారని కూడా ఆయన తెలిపారు. పట్టణ అధ్యక్షురాలు ఆర్ విజయ, ప్రధాన కార్యదర్శి సంధ్య, నాయకులు సత్యనారాయణ, రాజు, కళావతి, అరుణ, రాజేశ్వరి, మంజుల, స్వరూప, అపర్ణ, రాణి, కళావతి పాల్గొన్నార

మందమర్రిలో కరాటే పోటీలు ప్రారంభం

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సీఐఎస్ఎఫ్ బ్యారెక్‌లో శనివారం మన్యు కరాటే అకాడమీ ఆధ్వర్యంలో అండర్ 14 రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఆయా జిల్లాల నుంచి చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగారు. చిన్నారులు అంతకు ముందు కరాటేకు సంబంధించిన ప్రదర్శనలు కూడా ఆకట్టుకున్నాయి. అంతకు ముందు ఈ పోటీలను జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సభ్యులు కనపర్తి రమేష్, బీజేపీ నాయకులు దార రవిసాగర్, బీఆర్ఎస్ నాయకులు మద్ది శంకర్, కరాటే మాస్టర్ రంగు శ్రీనివాస్ ప్రారంభించారు.

'ఆరు గ్యారంటీలతో' మోసం చేస్తున్న కాంగ్రెస్

- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు
- సన్నరకం ధాన్యం బోనస్ డబ్బులు జమ చేయాలని రాస్తారోకో



దండేపల్లిలో రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు

దండేపల్లి, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీ పథకాల పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను పూర్తిస్థా యిలో అమలు చేయకుండా ప్రజలు, రైతులను మోసం చేస్తోందని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపిం చారు. రైతుల పక్షాన దండేపల్లిలో శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, రైతులతో కలిసి సన్నరకం ధాన్యం బోనస్ డబ్బులు చెల్లించాలని గంట పాటు రాస్తారోకో చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వరి ధాన్యానికి క్వింటా ల్‌కు 500 బోనస్ చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. నెలలు గడుస్తున్నా రైతులకు బోనస్ డబ్బులు జమ కాలే దన్నారు. కనీసం సన్న వడ్లకే బోనస్ ఇస్తే 7 కోట్ల 67లక్షల రుపాయాలు మాత్రమే నియోజకవర్గం రైతులకు చెల్లించా ల్సి ఉంటుందన్నారు. నియోజకవర్గంలో ఇంకా 2252 మంది రైతులకు బోనస్ డబ్బులు చెల్లించాల్సి ఉందన్నారు. ధాన్యం అమ్మిన రైతులందరి బ్యాంకు ఖాతాలో వెంటనే జమచేయాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న దండేపల్లి ఎస్సై తైసినోద్దీన్ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. రాస్తారోకో విరమించా లని కోరారు. దీంతో పార్టీ నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. బలవంతంగా రాస్తారోకోను విరమింపజేసి వాహనాల రాక పోకలను క్లియర్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువ నాయ కులు నడిపెల్లి విజిత్‌రావు, మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ పసర్తి అనిల్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ కాసన గొట్టు లింగన్న వైస్ చైర్మన్ అక్కల రవీందర్, లక్షెట్టిపేట మాజీ మున్సి పాలిటి వైస్ చైర్మన్ పోడెటి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు గోట్ల భూమన్న, రాజమల్లు, శ్రీనివాస్, సత్తయ్య, లక్ష్మన్, అకిల్, వెంకట రమణ, అంజన్న, ఇస్తాకర్, అఫ్సర్‌బేగ్, తిరుపతి, భీంరావు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ దర్బార్..

రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ దర్బార్ నిర్వహిస్తున్నట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. శనివారం రామగుండం కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్‌లో స్పెషల్ పార్టీ, క్యూ ఆర్‌టీ సిబ్బంది, అధికారులకు దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీ శ్రీనివాస్ హాజరై స్పెషల్ పార్టీ, సిబ్బందితో మాట్లాడి ఒక్కొక్కరిని అడిగి సమస్యలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చూస్తామన్నారు. ఏలాంటి సమస్య ఉన్నా దర్బార్‌లో చెప్పడం ఇబ్బందిగా ఉంటే ఆఫీస్‌కి వచ్చి నేరుగా చెప్పవచ్చన్నారు. స్పెషల్ పార్టీ, పోలీస్ విధి నిర్వహణలో భాగంగా ఎన్నో పని ఒత్తిళ్లను ఎదుర్కొనాల్సి వుంటుందని, క్రమశిక్షణ, ప్రణాళికబద్ధంగా విధులు నిర్వహించడం ద్వారా ఈ ఒత్తిళ్లను అధిగమించ వచ్చన్నారు. ఒత్తిళ్ల తట్టుకోలేక క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతో కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. సిబ్బంది క్రమ శిక్షణతో విధులను నిర్వర్తించాలని రామగుండం కమిషనరేట్‌కి, తెలంగాణ పోలీస్ మంచి పేరు తేవాలన్నారు. బయట డ్యూటీస్‌కి వెళ్లినప్పుడు ఇబ్బందుల ఉంటే సంబంధిత అధికారులకు తెలపాలన్నారు. పోలీస్ శాఖ ప్రతిష్ఠకి భంగం కలిగించే విధంగా ప్రవర్తించినా చర్య తీసుకుంటామన్నారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీరాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, ఆర్ ఎస్ఐలు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్, పాల్గొన్న సిబ్బంది



బూర్గుడలోని శివాలయం



నంబాలలోని శివాలయం

ముస్తాబవుతున్న శివాలయాలు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కుమరం భీం, మంచిర్యాల జిల్లాలో శివాలయాలను ముస్తాబు చేస్తున్నారు. 26వ తేదీ నుంచి ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఎండల తీవ్రత ఉన్నందున చలువ పందిళ్లు వేస్తున్నారు. ఆలయాలకు రంగులు వేసి తీర్చిదిద్దుతున్నారు. విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు.

● 26న మహా శివరాత్రి ● ఉత్సవాలకు సిద్ధం చేస్తున్న ఆలయ కమిటీలు

ప్రకృతి రమణీయం..

బెజ్జూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో నెలకొన్న చెప్రాల ఆధ్యాత్మిక కేంద్రం భక్తుల కొంగుబంగారంగా మారింది. ఓ వైపు ప్రాణహిత పరవళ్లుచ మరోవైపు దట్టమైన అటవీ ప్రాంతం అలరించే ప్రకృతి అందాల మధ్య నెలకొని ఉంది చెప్రాల. చెప్రాల ఆధ్యాత్మిక కేంద్రంలో సండగల వేళ భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ఈనెల 26న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఉత్సవాలకు పలు ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

● ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలంలోని బూర్గుడ శివాలయం శివరాత్రి వేడుకులకు ముస్తాబైంది. ఆసిఫాబాద్ పట్టణంతో పాటు మండలంలోని శివాల యాలు ముస్తాబు అవుతున్నాయి. . ఈ నెల 26న శివరాత్రి సందర్భంగా ఆలయాల్లో ఉద యం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కల్యా ణం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

● బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రంగనాయక, శివాలయ, హనుమాన్, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో రెండు రోజుల పాటు జాతర నిర్వహించనున్నారు. మండల కేంద్రంలోని అతి పురాత మైన రంగనాయక ఆలయాన్ని గోండు రోజుల కాలంలో నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది.

● దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని లగ్గాం ఉమా చంద్ర శేఖర ఆలయం, దహెగాం శివకేశవ ఆలయం మహాశిరాత్రి పర్వ దినాన్ని పురష్కరించుకుని ముస్తాబు చేస్తున్నారు.

● సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాలయం, వేంకటేశ్వర స్వామి ఆలయాలు ముస్తాబవుతున్నాయి.

● కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సదాశివపేట శివాలయంలో జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



బెజ్జూరులోని రంగనాథ, శివాలయం

● చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్జెల్లి గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో ఉన్న మునలమ్మ శివాలయం భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. ఏటా శివ రాత్రి సందర్బంగా వేల సంఖ్యలో అటు మహారాష్ట్ర ఇటు తెలంగాణ నుంచి భక్తులు తరలివస్తుంటారు. ఈ నెల 26, 27 వ తేదీల్లో జాతర నిర్వహిస్తారు. ఈ రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు, అభిషేకం, శివపార్వతుల ఊరేగింపు, అన్నదానం నిర్వహిస్తారు.



ఈస్‌గాం శివమల్లన్న ఆలయంలో..

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం ఈసుగాంలో ఉన్న శివమల్లన్న ఆలయంలో ఈ నెల 25, 26, 27 నుంచి జాతర నిర్వహించనున్నారు.ఈ ఆలయంలో శివలింగం సహజ సిద్ధమైన భస్మరేఖలు ఉండడం విశేషం. సిర్పూరు నియోజకవర్గంలోనే భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే ఆలయం ఇది. ఇందుకు తగ్గట్టు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు.

● రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండం నంబాలలోని పుణ్యక్షేత్రమైన నంబాల శివాలయంలో ఏటా శివరాత్రి సందర్భంగా పెద్ద ఎత్తున జాతర నిర్వహిస్తారు. ఈ జాతరకు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. ఈ ఆలయంలో శ్రీ గణపతి, శివలింగం, పార్వతి దేవి నందీశ్వరుడు, నాగేంద్రుడు, సూర్యడు, అంజనేయ స్వామి, నవగ్రహ విగ్రహాలున్నాయి. రెబ్బెన నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది. జాతర సందర్భంగా భక్తులకు సులభదర్శనం, కల్యాణం నిర్వహించనున్నారు.



చప్రాల ఆధ్యాత్మిక కేంద్రంలోని శివాలయం



ఈసుగాం ఆలయం



మూడు రోజుల పాటు మహాజాతర

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): చెన్నూర్ మండలంలోని కత్తెరసాల మల్లికార్జునుడి ఆలయం శివరాత్రి సందర్బంగా మూడు రోజుల పాటు జాతర నిర్వహించనున్నారు. మల్లికార్జునుడు విగ్రహ రూపం తో స్వామివారు భక్తులకు దర్శనమిస్తాడు. శివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.



యాదవుల ఆరాధ్య దైవం..

కత్తెరసాల గ్రామంతో పాటు ఈ ప్రాంతంలోని మిగితా గ్రామాల్లో యాద వులే ఎక్కువగా ఉన్నారు. వీరికి మల్లన్న స్వామి ఆరాధ్య దైవం.శివరాత్రి సమయంలో మూడు రోజుల పాటు మహా జా తర జరుగుతుంది. జాతర లో ఒగ్గు పూజారులు ఒగ్గు పఠనాలు, పూజలతో భక్తులు మల్లన్న స్వామికి బోనాలు సమర్పించుకుం టారు. శివరాత్రి పర్వ దినాన సమీపంలోని పంచకోశ ఉత్తర వాహిని గోదావరిలో పవిత్ర పుణ్యస్నానాలు ఆచరిస్తారు. అనంతరం మల్లికార్జునుడికి ప్రత్యేక పూజలు చేస్తారు.

పండగ వాతావరణం...

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు జాతర ఇక్కడ జరుగుతుంది. మొదటి రోజు పరమాన్నంతో మల్లన్న స్వామికి నైవేద్యం సమర్పించి పట్నాలు వేస్తారు. అనంతరం ఒగ్గు పూజారులు స్వామి వారి చరిత్ర, ఆలయ విశిష్టతను భక్తులకు వివరిస్తారు. కొత్త కుండల్లో వంటలు చేసి నిండు బోనాలతో స్వామి వారికి నైవేద్యంగా సమర్పిస్తారు. శివరాత్రి ఆలయ ప్రాంగణంలో శివ పార్వతుల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తారు.



దహెగాంలో ముస్తాబు చేసిన ఉమాచంద్రశేఖర ఆలయం

అనుమానాస్పదంగా ఒకరి మృతి

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తాండూర్ గ్రామానికి చెందిన సబ్బని నాగయ్య(49) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నాగయ్య శుక్రవారం కొండగట్టుకు వెళ్లి వేంపల్లిలో ఉంటున్న పెద్ద కొడుకు రాజశేఖర్ ఇంటి వద్దకు వెళ్లాడు. నాగయ్య శనివారం ఉదయం 9 గంటలకు నురుగులు కక్కుతూ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. 108లో ప్రభుత్వ ఆసుప త్రికి తరలించారు. వైద్యులు నాగయ్య అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి మరణంపై సరైన కారణం లేకపోవడంతో రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

గడ్డి వాము దగ్ధం

జైపూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుందారం గ్రామంలో వరిగడ్డి వాము పూర్తిగా దగ్ధమైంది. రైతు భోజనపు రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం గడ్డి వాముకు మంటలు అంటుకున్నాయి. స్థానికులు మంటలను ఆర్పివేయాలని ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. దీంతో వరిగడ్డి వాము పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ. 40 వేల నష్టం వాటిల్లిందని రైతు కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు గడ్డి వాముకు ఎవరైనా నిప్పు పెట్టారా, ప్రమాదవశాత్తూ జరిగిందా అని చర్చనీయాంశంగా మారింది.

గంజాయి పట్టివేత

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం హమాలి జెండా వద్ద శనివారం తనిఖీలు నిర్వహిస్తుండగా మహ్మద్ మస్తాన్ అనే అతని వద్ద వంద గ్రాముల గంజాయి స్వాధీన పర్చుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నస్పూర్ సీసీసీ వద్ద అద్దెకు ఉంటున్న మహ్మద్ మస్తాన్ గంజాయిని అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. మస్తాన్ స్వగ్రామం భూపాలపల్లి జిల్లా రుద్రారం. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముఖద్వారం నిర్మాణానికి భూమి పూజ

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని పెద్దవాగు నది తీరాన గల బాలేశ్వర ఆలయ ముఖద్వారం (ఆర్చి) నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వేధపండితులు మధుకర్ శర్మ, నరేష్ శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సురేష్‌కుమార్, లలిత, సుబ్బ శంబుదాస్, అరుంధతి, అశోక్, శోభ దంపతులు పూజలు నిర్వహించారు. ముఖ ద్వారం నిర్మాణ ఖర్చులు భరిస్తున్న శంభుదాస్ అరుంధతిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సుధారాణి, సురేఖ, సునీత, పద్మ, రమేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

సేవాలాల్ ఆశయాలు కొనసాగించాలి



ఆసిఫాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బంజారాలు



మాట్లాడుతున్న ప్రేంసింగ్ మహారాజ్

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): యువత సేవాలాల్ ఆశయాలను కొనసాగించాలని దీక్ష గురువు ప్రేసింగ్ మహారాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ శివప్రసాద్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ యువత దురలవాట్లకు పాల్పడకూడదని సేవాలాల్ బోధించారని గుర్తు చేశా రు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని చెప్పారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ సేవాలాల్ బాటలో ప్రతి ఒక్కరూ నడువాలన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో బంజార భవన్ నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ మా ట్లాడుతూ బంజారాలలో ఐక్యత లోపంతో అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్ జిల్లా కేంద్రాలలో బంజారా భవన్ నిర్మాణాలు పూర్తైనప్పటికీ ఆసిఫాబాద్‌లో పూర్తికాక పోవడమే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో బంజార సంఘం నాయకులు నరేష్, శంకర్ నాయక్, రవినాయక్, తిరుపతి, కిరణ్‌నాయక్, రవీందర్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● జయంతి వేడుకల్లో ప్రోటోకాల్ రగడ..

జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి వేడకల్లో ప్రోటోకాల్ రగడ చోటు చేసుకుంది ప్రభుత్వ కార్యక్రమం కావడంతో ఎమ్మెల్యేగా తనకు ఇవ్వాల్సిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్ర మంలో ప్రజాప్రతినిధికి గౌరవం ఇవ్వక పోవడం ఏంటని ప్రశ్నించారు. సేవాలాల్ అందరికి సంబంధించిన వారని ఆ మహనీయుడి జయంతిలో రాజకీయాలు చేయడం సరైన విధానం కాదన్నారు. అనంతరం వేడుకలను బహిష్కరించి వెళ్లి పోయారు. ఉత్సవ కమిటీ సభ్యులు నచ్చ చెప్పడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి

దండేపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయి నుంచే ప్రతి విద్యార్థి పోటీతత్వంతో చదవాలని జిల్లా సెక్టోరియల్ అధికారి సత్యనారాయణమూర్తి, మండల విద్యాధికారి దుర్గం చిన్నయ్యలు పేర్కొన్నారు. దండేపల్లి మండలం వెల్గనూర్, ద్వారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలోని శనివారం జరిగిన కాంప్లెక్స్ స్థాయి ప్రాథమిక పాఠ శాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వి ద్యార్థులకు వారు బహుమతులు ప్రధానం చేశారు. విద్యార్థులందరు కష్టపడి చదివితే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఇప్పటి నుంచే అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించాలని వారు సూచించారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు దృష్టి సారించి వారికి ప్రత్యేక తరగతుల ద్వారా చక్కటి విద్యాబోధన అందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, చిన్న సరసయ్య, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పిలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

లక్షెట్టిపేట, ఫిబ్రవరీ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సుల కోసం దరకాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ మహాత్మ సంతోష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌టీఏ 4సంవత్సరాల టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ద్వారా నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్టు 2025-26ద్వారా ఆన్‌లైన్‌లో దరకాస్తులు స్వీకరించడం జరుగుతుందని అసక్తి గల విద్యార్థులు వచ్చే నెల 16వ తారీకు లోపు వెబ్‌సైటులో దరకాస్తు చేసుకోవాలని, వివరాలకు కళాశాలలో నేరుగా సంప్రదించాలని ఆయన సూచించారు.



క్రమశిక్షణతో సమాజ సేవలో పాల్గొనాలి



మాట్లాడుతున్న డీజీఎం అరవిందరావు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి సమాజ సేవలో పాల్గొనాలని డీజీఎం(పర్సనల్) పి. అరవిందరావు అన్నారు. లార్డ్ బెడెన్ పావెల్ జయంతి సందర్భంగా సింగరేణి పాఠశాలలో ప్రపంచ ఆలోచనా దినోత్సవం నిర్వహించారు. ముందుగా సర్వమత ప్రార్థనలు చేసి, స్కౌట్స్ జెండా ఆవిష్కరించి పావెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, పర్సనల్ మేనేజర్ ఎ. రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయుడు సంతోష్, సీనియర్ ఉపాధ్యాయుడు రాధాకృష్ణమూర్తి, గైడ్ కెప్టెన్ హేమలత, స్కౌట్ మాస్టర్ శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి టౌన్, (ఆంధ్రజ్యోతి): స్కౌట్ అండ్ గైడ్ అభివృద్ధికి బెడెన్‌పావెల్ చేసిన కృషి మరువలేనిదని సింగరేణి పాఠశాల కరస్పాండెంట్ పీఎస్ శ్యాంసుందర్ తెలిపారు. శనివారం పట్టణంలోని సింగరేణి పాఠశాలలో బెడెన్‌పావెల్ జయంతి సందర్భంగా ప్రపంచ ఆలోచన దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు జె పురుషోత్తం, స్కౌట్ మాస్టర్లు శక్తికుమార్, గైడ్ మాస్టర్ కల్పలత, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): గోలేటి సింగరేణి పాఠశాలలో శనివారం వరల్డ్ థింకింగ్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం మచ్చగిరి నరేందర్ జెండాను ఆవిష్కరించారు కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ భాస్కర్, ఎస్‌ఓటు జీఎం రాజమల్లు, ఇంచార్జి కరస్పాండెంట్ శ్రీనివాస, సింగరేణి ట్రైనింగ్ కమిషనర్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

6న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి ఏరియాలోని శాంతిఖని బొగ్గు గని పునర్వవీకరణ సంబంధించి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ మార్చి 6వ తేదీన గని ఆవరణలో నిర్వహించనున్నామని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. శనివారం స్థానిక జీఎం కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గని విస్తరణకు సంబంధించి ప్రజలు వెల్లడించే అభిప్రాయాలను నోట్ చేసుకోవాలని అన్నారు. ఎవరికి ఎలాంటి అనుమానాలు ఉన్నా వాటిని నివృత్తి చేయాలని చెప్పారు. గని విస్తరించే ప్రాంతాల ప్రజల అభివృద్ధికి సంబంధించి చేపట్టాల్సిన పనులను కూడా ముందుగా అంచనా వేయాల ని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్ర మంలో ఎస్‌వోటూ జీఎం విజయ ప్రసాద్, ఏరియా రక్షణాధికారి రవిందర్, ఏరియా ఇంజనీర్ వెంకట రమణ, శాంతిఖని ఏజెంట్ ఖాదీర్, డీజీఎం ఐఈడీ రాజన్న, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, పర్యావ రణ అధికారి వెంకట్‌రెడ్డి, ఫారెస్టు అధికారి రమణా రెడ్డి, ఎస్టేట్ అధికారి స్వప్న, ఏరియా సర్వే ఆఫీసర్ ఉజ్వల్ బందో పాధ్యాయడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం దేవేందర్

బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి సమస్యలు పరిష్కరించాలి



వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇస్తున్న సింగరేణి జేఏసీ నాయకులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లిలోని సింగరేణి ఏరియా ఆసుపత్రిలోని సమస్యలను పరిష్కరించాలని శనివారం సింగరేణి జేఏసీ నాయకులు బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రికి వచ్చిన ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందించారు. ఈ సదర్బంగా నాయకులు మాట్లాడుతూ గతంలో వైద్యులు, అన్ని వార్డులతో వైద్య సేవలందించిన ఏరియా ఆసుపత్రిలో ప్రస్తుతం వార్డులన్నీ మూసివేశారని, వైద్యులు లేరని పేర్కొన్నారు. స్పెషలిస్టులు, మందుల కొరత ఉందని తెలిపారు. ఏరియా ఆసుపత్రిలో అన్ని రకాల స్పెషలిస్టు వైద్యులు, సిబ్బందిని నియమించాలని కోరారు. అన్ని వార్డులను తెరిచి కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్యం అం దించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జేఏసీ నా యకులు మణిరాంసింగ్, చాంద్‌పాషా, మహేందర్, శంకర్, రాజ్‌కుమార్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశీలించి.. సమస్యలు తెలుసుకుని..

రెబ్బెన, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలోని సింగరేణి గనులను శనివారం డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు) వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్బంగా కైరిగూడ ఓసీని పరిశీలించి వివిధ సమస్యలపై అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జీఎం ఎం.నరేందర్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి చంద్ర శేఖర్, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, భాషా, మేనేజర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జీఎంకు సన్మానం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ జీఎంను శ్రీనివాస్‌ను సీఐటీయూ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్ర మంలో బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. సింగరేణి బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సభ్యులు జీఎం సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

మంచిర్యాల డీసీపీ భాస్కర్

జైపూర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా జరిగే వేలాల జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా రోడ్డు మరమ్మతులు చేయించాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

శనివారం ఆయన ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి వేలాల జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి ఘాట్ వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్, జైపూర్ ఎస్ఐ శ్రీధర్, భీమారం ఎస్ఐ శ్వేత, వేలాల ఈవో రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత నెన్నెల జట్టు

నెన్నెల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నిర్వహించిన పూదరి సత్యనారాయణ గౌడ్ మెమోరియల్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా నెన్నెల జట్టు నిలిచింది. వివిధ గ్రామాలకు చెందిన 46 జట్లు పాల్గొన్నాయి. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నెన్నెల జట్టు చాపియన్‌షిప్ దక్కించుకుంది. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీ న్, నెన్నెల ఎస్సై ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విన్నర్‌టీంకు రూ.20 వేలు, రన్నరప్‌కు రూ. పది వేల నగదుతో పాటు ట్రోఫీలు ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ క్రీడలతో పాటు చదువుపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన పూదరి అంజన్నగౌడ్, నరేష్‌గౌడ్‌లను అభినందించారు. మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు అంజద్ భాయ్, సీనియర్ క్రీడాకారులు నారాయణ, గౌసుద్దీన్‌బాబా, హాజీపాషా పాల్గొన్నారు.


విన్నర్ టీమ్‌కు ట్రోఫీ అందజేస్తున్న బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, ఎస్సై ప్రసాద్

ఎమ్మెల్సీ ఎన్నికలు గెలిచిన వెంటనే కాంగ్రెస్‌పై యుద్ధం

● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, పక్కన బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి

భగత్‌నగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం ప్రారంభిస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పచ్చీస్ ప్రభారీల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నయవంచన, నమ్మక ద్రోహానికి తగిన గుణపాఠం చెప్పాలని పట్టభద్రులు, ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. బీజేపీ గెలిచిన వారం రోజుల్లోనే దీక్షలు, ఉద్యమాలతో కాంగ్రెస్ సర్కార్‌పై యుద్ధం ప్రారంభిస్తుందన్నారు. కాంగ్రెస్ బీసీలకు వెన్నుపోటు పొడిచి ఇవాళ బీసీ జపం చేయడం సిగ్గుచేటన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తామని పార్టీ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులే లేక పోటీ నుంచి తప్పుకున్నదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు అభ్యర్థులు దొరకక బయటి వాళ్లను అరువు తెచ్చుకుందన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డి తాను గెలిస్తే వేతనమంతా పాఠశాలల అభివృద్ధికే ఖర్చు చేస్తానని ప్రకటించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రమాదంలో కాలు కోల్పోయిన యువకుడిని పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ శనివారం పరామర్శించారు. శ్రీరాంపూర్‌లోని కొత్తరోడ్డు ఏరియాకు చెందిన కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ నాయకుడు బొడ్డు ప్రభాకర్ కుమారుడు బొడ్డు క్రిష్ణ హైదరాబాద్‌లో జరిగిన ఓ ప్రమాదంలో నాలుగు నెలల క్రితం గాయపడ్డాడు. కాలు పోగొట్టుకున్నాడు. విషయం తెలుసుకున్న గడ్డం వంశీకృష్ణ శనివారం క్రిష్ణ కుటుంబాన్ని పరామర్శించారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు గుగులోత్ మల్లేష్ నాయక్

నెన్నెల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లిలో ప్రభుత్వం అధికారికంగా ఈ నెల 23న నిర్వహించే సంత్ శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని విజయవంతం చేయాలని సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షులు గుగులోత్ మల్లేష్‌నాయక్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని కొత్తూరులో స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. బంజారాల సంస్కృతి ఉట్టిపడేలా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వేడుకల్లో లంబాడాలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేనా భీమారం మండల అధ్యక్షులు బుక్య మోతీలాల్‌నాయక్, తండా నాయకులు పాల్యా సీతారం, జయరాం, లాలూనాయక్ పాల్గొన్నారు.

'రియల్ ఎస్టేట్ సంస్థపై చర్యలు తీసుకోవాలి'

భీమారం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ లోగోను వినియోగిస్తూ అమాయక ప్రజలకు భూములు అమ్ముతూ మోసగిస్తున్న సిస్కో ఇన్‌ఫ్రా డెవలపర్స్ అనే రియల్ ఎస్టేట్ సంస్థపై చర్యలు చేపట్టాలని మంచిర్యాల జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు నయీంపాషా పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సంబంధిత రియల్ ఎస్టేట్ సంస్థపై హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.



కాలువలు ఇలా సాగు నీరెలా..?

● కబ్జా చేస్తున్నా పట్టించుకోని నీటిపారుదల శాఖ ● ఇబ్బందుల్లో రైతులు

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండలంలోని కడెం కాలువల రోడ్లు రోజు రోజుకూ కనుమరుగవుతున్నాయి. కాల్వలకు సమీపంలోని రోడ్లను కొందరు కబ్జా చేసి నిర్మాణాలు చేపడితే మరికొంతమంది కబ్జా చేసి సాగు చేసుకుంటున్నారు. దీంతో కాలువల ద్వారా పూర్తి స్థాయిలో సాగునీరు అందకపో వడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులకు ఎన్ని సార్లు రైతులు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదంటున్నారు మండలంలోని రైతులు.

కాలువలకు ఇరువైపులా రోడ్లు..

లక్షెట్టిపేట మండలంలోని గ్రామాలకు కడెం పెద్ద కాలువ ద్వారా రైతులకు సాగు నీరు అందించే కాలువలకు దాదాపుగా ఐదు మీటర్ల రోడ్డు ఉంటుంది. ఈ రోడ్డు గుండా ఇరిగేషన్ అధికారులు నిత్యం పర్యటిస్తూ కాలువల స్థితిగతులను తెలుసుకుంటా రు. అంతే కాకుండా చెత్త చెదారం పారిశుధ్య సమస్య లేకుండా కెనాల్‌కు ఇరువైపుల సిమెంటు గోడ లను ఏర్పాటు చేసి అవి ఎక్కడైనా చెడిపోయి ఉన్నా వాటికి మరమ్మతులు జరిపించి రైతులకు సాగు నీరు అందేలా చూడాలి. కానీ ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో కాలువలకు ఇరువైపులా ఉన్న రోడ్డు భూములను కొందరు ఆక్రమించుకుంటున్నారు. దీంతో పిల్ల కాలువల ద్వారా అందాల్సిన నీరు రైతులకు అందకపోవడంతో సాగు చేసుకునేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో రైతులు పండించిన ధాన్యం ఇంటికి చేరాలంటే కూడా రోడ్లు లేక రైతులు తంటాలు పడుతున్నట్లు వాపోతున్నారు. నిత్యం కాలువలను పర్యవేక్షిస్తూ కాపాడాల్సిన ఆఫీసర్లు సమస్య ఉన్నకాడికి మాత్రమే వెళ్లి తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆధికారులు స్పందించి కాలువలకు ఇరువైపుల ఉన్న రోడ్లను గుర్తించి మరమ్మతులు జరిపించాలని కోరు కుంటున్నారు రైతులు.




ఆంధ్రబోర్‌లో కెనాల్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు, అంకత్‌పల్లిలో ఆక్రమణకు గురైన కడెం పిల్లకాలువ

అధికారులకు చాలా సార్లు చెప్పాం..

పెరుక శ్రీనివాస్, రైతు, అంకత్‌పల్లి



కడెం పిల్ల కాలువలకు రెండు వైపుల ఉన్న రోడ్లను కొందరు ఆక్రమించుకుంటున్నట్లు ఆఫీసర్లకు చాలా సార్లు చెప్పాం. అయిన ఎవరూ పట్టించుకోవడం లేదు. కొన్ని కాలువలకు గండి పడ్డాయి, కొన్ని ప్రాంతాల్లో కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి వీటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎప్పటికప్పుడు మరమ్మతులు జరిపితే కాలువల గుండా నీరు పూర్తి స్థాయిలో వచ్చి రైతుల సాగుకు ఏలాంటి ఇబ్బంది లేకుండా ఉంటది. వచ్చేది ఎండాకాలం కనీసం ఇప్పుడైనా మరమ్మతులు జరిపి రైతులకు నీరు వచ్చేలా చూడండి సార్.

ఆక్రమిస్తున్న మాట వాస్తవమే..

రాజేశ్వర్, ఇరిగేషన్ జేఈ. లక్షెట్టిపేట



కాలువలకు ఇరు వైపులా రోడ్లు ఉంటాయి. వాటిని కొందరు ఆక్రమిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆలా ఆక్రమించకూడదని పలు మార్లు చెప్పాము. గ్రామ సభల్లో కూడా కాలువ రోడ్లను కాపాడు కోవాలి అవగాహన కల్పిస్తాము. కాలువ రోడ్లను ఆక్రమిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటా.

బీఆర్ఎస్ ఆర్థిక విధ్వంసం చేసినా అభివృద్ధి, సంక్షేమం కొనసాగిస్తున్నాం

రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, పక్కన మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ, ప్రభుత్వ విప్ శ్రీనివాస్

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పదేళ్లలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని ఆర్థికంగా విధ్వంసం చేసినా తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం కరీంనగర్‌లోని డీసీసీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 27న నిర్వహించనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 24న సాయంత్రం 4 గంటలకు ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాల మైదానంలో నియోజ కవర్గ పరిధిలోని పట్టభద్రులతో ఏర్పాటు చేయనున్న భారీ బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు హాజరుకానున్నారని తెలిపారు. రెండుసార్లు కరీంనగర్ ఎంపీగా గెలిచి కేంద్రమంత్రి పదవిలో ఉన్న బండి సంజయ్‌కుమార్ ఆరేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి, రాష్ట్రానికి ఏం తెచ్చారో చెప్పాలన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు డాక్టర్ సత్యనారాయణ, మేడిపల్లి సత్యం పాల్గొన్నారు.

ప్రసన్నహరికృష్ణకు ఓయూ జేఏసీ మద్దతు


సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు రఘు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి డాక్టర్ ప్రసన్న హరికృష్ణకు ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ మద్దతు ప్రకటించినట్లు జేఏసీ నాయకుడు కోదూరి రఘు తెలిపారు. శనివారం నగరంలోని ప్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు జాతీయ పార్టీలు అగ్రవర్ణ పెత్తందారులకు మాత్రమే టికెట్లు ఇచ్చి ప్రోత్సహించాయన్నారు. డాక్టర్ ప్రసన్నహరికృష్ణ బహుజన బిడ్డ అని, ఉస్మానియా విద్యార్థిగా విద్యను అభ్యసించారని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించిన ప్రసన్నహరికృష్ణకు మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలని కోరారు. ప్రసన్నహరికృష్ణను గెలిపించి మండలికి పంపిస్తే బహుజన గొంతుకను వినిపిస్తారన్నారు.

పంచాయతీలకు నిధుల కటకట..

(5వ పేజీ తరువాయి)

పాలకవర్గం కాలపరిమితి ముగిసిన నాటి నుంచి రోజువారి పారిశుధ్యం, ట్రాక్టర్లలో డీజిల్ పోయించడం, వాటికి మరమ్మతులు, బ్లీచింగ్, బయోటెక్స్, ఫాగింగ్, తదితర సామగ్రి కోసం దుకాణాల్లో ఖాతాలు పెట్టామని, మళ్లీ సామగ్రి ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న చెక్కులను వెంటనే క్లియర్ చేయించడంతో పాటు ట్రెజరీకి అనుసంధానం లేకుండా నేరుగా చెల్లింపులు జరిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో మార్చి ఒకటవ తేది నుంచి పంచాయతీల నిర్వహణ చేపట్టలేమని స్పష్టం చేస్తూ వినతి పత్రం అందజే శారు. ఈ లోగా ప్రభుత్వం నిధులను విడుదల చేస్తేనే పంచాయతీల నిర్వహణ సక్రమంగా జరిగే అవకాశాలున్నాయి. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు జఠిలం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

దండేపల్లి, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి చిన్నమైల్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని దండేపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు గోపతి రాజయ్య సూచించారు కార్యక్రమంలో నాయకులు సత్తయ్య, సంతోష్, లచ్చన్న పాల్గొన్నారు

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని పలు వార్డుల్లో కాంగ్రెస్ నాయకులు శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు పట్టభద్రుల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆరీఫ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాందేని చిన్న వెంకటేష్ ఉన్నారు.

నాయకులే కమీషన్ల కోసం వేధిస్తున్నారు

దుబ్బపల్లి గ్రామస్థుల ఆవేదన

జైపూర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తమ నాయకులే కమీషన్ల కోసం వేధిస్తున్నారని రామారావుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బపల్లి గ్రామానికి చెందిన కామెర రాజం, దుర్గయ్య, తిరుపతి, రాజం, నాగలక్ష్మీలు ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలు చెప్పుకునేందుకు శనివారం కలెక్టర్ వద్దకు వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2018లో శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ పేరుతో తమ గ్రామాన్ని సింగరేణి అధికారులు సర్వే చేశారన్నారు. సర్వేలో 200 ఇండ్లు ఉండగా, అధికారులు సర్వే రికార్డు చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఇండ్లన్నీ నిజమైనవి కావని, పరిహారం కోసం నిర్మించుకున్నారని రాజకీయ నాయకులు అధికారు లకు ఫిర్యాదు చేయడంతో ఎంపిక నిలిచిపోయినట్లు పేర్కొన్నారు. రెండోసారి సర్వే నిర్వహించిన సింగరేణి, రెవెన్యూ అధికారులు అర్హుల ఎంపికను వెల్లడించకుండా నిలిపివేశారన్నారు. సర్వేకు ముందు తమ గ్రామంలో 200 ఇండ్లు ఉండేవని స్థానిక నాయకులకు కమీషన్లు ఇవ్వకపోవడంతో అడ్డు పడుతున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ స్పందించి రెండు సార్లు నిర్వహించిన సర్వేలో అర్హులను ఎంపిక చేసి న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరామన్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు తమకు అడ్డుపడకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు జనగామ విజయ, కామెర జగదీశ్వరి, సల్లూరి చంద్రమతి, జాడి పద్మ, కామెర లక్ష్మీ, కోట లక్ష్మీ, కామెర మల్లు, పాల్గొన్నారు.


కలెక్టర్‌ను కలిసిన దుబ్బపల్లి గ్రామస్థులు

బీసీలను విమర్శిస్తే సహించేది లేదు

బీసీ సంఘం నాయకులు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన మాల మహానాడు నాయకులు పైడిమల్ల నర్సింగ్ బీసీలపై అనుచిత వాఖ్యలు చేయడం సరికాదని, వెంటనే ఆయన క్షమాపణలు చెప్పాలని బీసీ సంఘం గౌరవ అధ్యక్షులు పోలు శ్రీనివాస్, సకినాల శంకర్ తెలిపారు. శనివారం మందమర్రి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల బీసీల విషయంలో నోటికి వచ్చిన విధంగా మాట్లాడడం ఏమిటని వారు మండిపడ్డారు. జనాభా నిష్పత్తి ప్రకారం 56 శాతం ఉన్న బీసీలు దళిత బహుజన రాజ్యాధికారం కోసం పోరాడుతున్నది వాస్తవం కాదా అని పేర్కొన్నారు. ఏదైనా సమస్య ఉంటే దాని గురించి మాట్లాడాలే తప్ప అనవసరంగా బీసీలపై నోరు పారేసుకోవడం ఏమిటని ధ్వజమెత్తారు. బీసీ సంఘం నాయకులు నేరెల్ల వెంకటేష్, మూడారపు శేఖర్, బొలి శెట్టి రాజయ్య, రామస్వామి ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడిన ఏకైక పార్టీ బీజేపీ

బీజేపీ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య


మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య, పక్కన బీపేజీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్‌రావు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్య లపై సమస్యలపై పోరాడిన ఏకైక పార్టీ బీజేపీ అని బీజేపీ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర పోరాటాలు చేస్తుందని 317 జీవో విషయంలో అప్పటి బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ దీక్షలు చేసి జైలు పాలయ్యారన్నారు. అప్పటి బీఆర్ ఎస్ పాలకులు ఎన్ని కేసులు పెట్టినా వెనుకడుగు వేయకుండా ఉపాధ్యాయుల పక్షాన పోరా టాలు చేశామన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు మండలిలో గళం వినిపిం చడానికి ఒక్క అవకాశం ఇచ్చి మొదటి ప్రాధ్యానత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు, పట్టి వెంకటకృష్ణ, దుర్గం అశోక్, అశోక్ వర్ధన్, తుల ఆంజనేయులు, అమిరిషెట్టి రాజ్‌కుమార్, సంతోష్, రమేష్, రాకేష్, రాజమౌళి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం పరిశీలన

నెన్నెల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) మండల కేం ద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని శనివారం బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ పరిశీలించారు. ఈ నెల 27న నిర్వహించనున్న పోలింగ్‌కు సంబందించిన ఏర్పాట్లు, కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు గూర్చి సిబ్బందితో చర్చించారు. మండలంలోని ఓటర్ల వివరాలు తెలుసుకున్నారు. వారికి తగిన విధంగా అన్ని ఏర్పాట్లు చే యా లని సూచించారు. అనంతరం పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులతో సమావేశమయ్యారు. విద్యార్థి జీవి తంలో పదో తరగతి మైలురాయిలాం టిదన్నారు. భయం వీడి చదువుపై దృ ష్టి పెడితే విజయం అందివస్తుంద న్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి తల్లి దండ్రులకు, గురువులకు మంచిపే రుతే వాలన్నారు. నెన్నెల ఎస్సై ప్రసాద్ ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

విద్యుత్ సరఫరాలో అంతరాయం

గర్మిళ్ల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) పాత మంచిర్యాలలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ డీఈ కైసర్, ఏడీఈ మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీసీ, నస్పూర్, హాజీపూర్ ఫీడర్ల పరిధిలోని సబ్‌స్టేషన్‌లకు, రాజీవ్‌నగర్, వేంపల్లి, హాజీపూర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ ఉండదని తెలిపారు.

సమస్యల పరిష్కారంలో టీఎన్‌జీవో ముందుంటుంది


మాట్లాడుతున్న జగదీశ్వర్

గర్మిళ్ల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో టీఎన్‌జీవో ముందుంటుందని టీఎన్‌జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు, అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. శనివారం మంచిర్యాలలోని టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీపీఎస్ వ్యవస్థను రద్దు చేసి పాత పింఛన్ వ్యవస్థను అమలు చేయాలన్నారు. 317 జీవో బాధితుల సమస్యలు పరిష్కరించాలని, పీఆర్‌సీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించాలన్నారు.

గోదావరి తీరాన పారిశుధ్య పనులు

చెన్నూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) :ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని చెన్నూరు పంచకోశ ఉత్తర వాహిని గోదావరి తీరాన శనివారం మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. గోదావరి తీరాన కర్మకాండలతో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని తొలగించి శానిటేషన్, క్లోరినేషన్ చేశారు.



చూపించిన చోటే ఇల్లు.. వేరేచోట్ల నిర్మిస్తే రద్దు

సర్వే సమయంలో చూపించిన స్థలంలోనే ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అప్పుడు చూపించిన ప్లాటు కాకుండా వేరే చోట్ల ఇల్లు నిర్మించేందుకు సిద్ధమైతే రద్దు చేయనుంది. ఇళ్ల నిర్మాణంలో పారదర్శకత పాటించాలని, జియో ఫెన్సింగ్ విధానాన్ని అమలు చేయాలని, అప్పుడే నిధులు ఇస్తామని కేంద్రం స్పష్టం చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది.



బెజ్జూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వ సాయంతో నిర్మించే ఇళ్లకు తొలిసారి జియో పెన్సింగ్ చేయనున్నారు. దీని కోసం కృతిమ మేధ(ఏఐ) సాయంతో ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేశారు. ఇందిరమ్మ ఇళ్లతో దీన్ని అమల్లోకి తేనున్నారు. 2013లో రాష్ట్రంలో జియో ట్యాగింగ్ విధానాన్ని అమలు చేయడానికి అప్పటి ప్రభుత్వం ప్రతిపాదించినా అమలు కాలేదు. ఈసారి ఇందిరమ్మ ఇళ్లలో అక్రమాలు జరిగినట్లు తేలితే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నిధులు ఇవ్వబోమని కేంద్రం తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో అక్రమాలకు అవకావం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం జియో పెన్సింగ్ విధానం అమలుకు నిర్ణయం తీసుకుంది.

● జిల్లాకు ఏడు వేలు..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రెండు నియోజకవర్గాలకు మొత్తం ఏడు వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానున్నాయి. ఒక్కో నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500ఇళ్ల చొప్పున మంజూరు చేస్తున్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రెండు నియోజకవర్గాల పరిదిలో ఏడు వేల ఇళ్లు మంజూరు కానున్నాయి. మొదటి విడతలో సిర్పూర్(టి) నియోజకవర్గానికి 1,324, ఆసిఫాబాద్‌కు 1,067ఇళ్లను మంజూరు చేశారు. ఎమ్మెల్సీ కోడ్ జిల్లాలో అమలులో ఉన్నందున ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టేందుకు మరింత ఆలస్యం జరిగే అవకాశం ఉంది. ఇక ఎల్1 జాబితా ఇన్‌చార్జిమంత్రి అనుమతితో ఆమోదించనుండడంతో స్థానిక ఎమ్మెల్యేలే కీలక పాత్ర పోషించనున్నారు. అయితే జిల్లాలో రెండు నియోజకవర్గాల పరిదిలో ఇద్దరు కూడా ప్రతిపక్ష పార్టీకే చెందిన వారు ఉండటం వల్ల వారికి ఏ మాత్రం ప్రాదాన్యత ఇస్తారో చూడాలి.

● గతంలో అక్రమాలు..

గతంలో ఇందిరమ్మ ఇళ్లలో చాలా అక్రమాలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలున్నాయి. ఒక స్థలంలో చూపించి మరో స్థలంలో ఇళ్లు నిర్మించుకోవడం.. పాత ఇళ్లకే రంగులు వేసి కొత్తవిగా చూపించి బిల్లులు తీసుకోవడం.. బేస్‌మెంట్ లెవల్లో మొదటి బిల్లు ఉపాధి నిధుల నుంచి కావడంతో అందిన కాడికి దోచుకు న్నారు. ఇకపై అలాంటి వాటికి అవకాశం ఉండదు. అలా చేస్తే ఇల్లు మంజూరు రద్దవుతుందని, బిల్లు రాదని అధికారులు చెబుతున్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో మార్చి 8 తర్వాత ఆయా గ్రామాలు, పట్టణాలకు ఇళ్లు కేటాయించి మంజూరు చేయనున్నారు. ఆ వెంటనే ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించనున్నారు.

● సొంత స్థలం ఉన్న వారికే..

మొదటి విడతలో సొంతంగా స్థలం ఉన్నవారికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇటీవల సర్వే చేసిన అధికారులు సొంత జాగా ఉన్న నిరుపేదలతో కూడిన ఎల్1 జాబితాను సిద్ధం చేశారు. ఇళ్లు కట్టే స్థలాన్ని సర్వే సమయంలో చూపారు. ఇప్పుడా స్థలం జియో పెన్సింగ్ చేయనున్నారు. ఆ స్థలంలోనే ఇంటి నిర్మాణానికి ముగ్గు పోయాల్సి ఉంటుంది. ముగ్గు పోసే రోజు గ్రామ కార్యదర్శికి, వార్డు అధికారికి సమాచారం ఇవ్వాలి. సర్వేలో చూపిన స్థలం అదేనా కాదా అని వారు ధృవీకరించాలి. ఆర్వాతే ప్రత్యేక యాప్‌లో స్థలం వివరాలు, అక్షాంశ, రేఖాంశాల వివరాలతో జియో పెన్సింగ్ చేస్తారు. తర్వాత తనిఖీకి వచ్చినప్పుడు ఆ స్థలం వద్ద నిల్చొని యాప్ ద్వారా పరిశీలిస్తారు. గతంలో ఇచ్చిన వివరాలు మ్యాచ్ అయితేనే పొటోలు, వివరాలు అప్‌లోడ్ అవుతాయి. ఏమాత్రం తప్పుడు సమాచారం ఉన్నా యాప్ తిరస్కరిస్తుంది.

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిబంధన
- సర్వే సమయంలో చూపిన స్థలంలో చేపడితేనే బిల్లు
- అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు
- జియో ఫెన్సింగ్ విధానం ద్వారా అనుమతులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 132కేవీ విద్యుత్ లైన్ నిర్మాణం కోసం 33 కేవీ రవీంద్రనగర్, 11 కేవీ అనుకోడ, 11 కేవీ చీపురుదుబ్బ ఫీడర్లలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని డీఈ రాజేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కోయయాపల్‌గూడ, యాపలగూడ, నాగెపల్లి, గురుడుపేట, కన్నెపల్లి, కన్కి, బోధంపల్లి, రవీంద్రనగర్, బాబాపూర్, గంగాపూర్, బాబాసాగర్, చింతలమానేపల్లి, రుద్రాపూర్, కర్జవెల్లి, ముంజంపల్లి, బారెగూడ, పోతెపల్లి, కాటేఎల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచి పోతుందని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లికి చెందిన మైనర్ బాలిక, కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన యువకుడితో ఆదివారం జరుగాల్సిన వివాహాన్ని శనివారం అధికారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా బాల సంరక్షణ విభాగం అధికారులు, ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు తల్లదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. డీసీపీవో మహేష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమయపాలన పాటించాలి

జైనూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉపపాధ్యాయులు సమయ పాటించాలని ఎస్సీఈఆర్టీ ఉయిక శంకర్ అన్నారు. మండలంలోని షేకుగూడ, తదితర గ్రామాల్లోని గిరిజన సంక్షేమ పాఠశాలలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు సిబ్బంది పాల్గొన్నారు

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గణేశ్, కాంగ్రెస్ నాయకులు

కెరమెరి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జిల్లా ఇన్‌చార్జి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేశ్ కోరారు. మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ కార్యకర్తలు ఐక్యంగా ఉండి నరేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మునీర్ అహ్మద్, కుసుంరావ్, లక్ష్మణ్, జలపతి, తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపంచాలిన మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్, ఉపాధ్యక్షుడు పెందుర్ ప్రకాష్, నాయకులు సుద్దాల శ్రీనివాస్, దండుగుల మహేష్, సుద్ధాల ఆనంద్, కాంబ్లే దత్త, కనక గంగారాం పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన కోనేరు కోనప్ప



ముఖ్యమంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శనివారం సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కలిశారు. కొన్ని రోజుల క్రితం కౌటాల, చింతలమానేపల్లి మండలాల్లో పర్యటించి గ్రామస్థులతో సమావేశమై వచ్చే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని చెబుతూ వచ్చారు. శుక్రవారం బీఎస్పీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కోనేరు కోనప్ప భేటీ అయ్యారు. పార్టీలో తగిన గుర్తింపు ఇస్తామని, వీర్ధండి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని, సిర్పూర్ నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

సిర్పూర్(యు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎండకాలం సమీపిస్తుండడతో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. రాఘపూర్, సిర్పూర్(యు) గ్రామాలను శనివారం అదనపు కలెక్టర్ సందర్శించారు. తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో కృష్ణారావు తదితరులు ఉన్నారు.

పీఆర్టీయూటీఎస్ నాలుగు మండలాల అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

కెరమెరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం పీఆర్టీయూటీఎస్ నాలుగు మండలాల అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. కెరమెరి అధ్యక్షుడిగా రాథోడ్ రవీందర్, ప్రధాన కార్యదర్శిగా శివప్రసాద్, జైనూరు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఆత్రం దత్తు, రాథోడ్ రవీందర్ ఎన్నికయ్యారు. సిర్పూర్(యూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా భూమన్న, మోహన్, లింగాపూర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఆడె సోహన్‌సింగ్, రాథోడ్ యువరాజ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆడె ప్రకాష్, నాయకులు భరత్‌రావు, తులసీరాం, భూమున్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్న ఆదిలాబాద్ ఆర్ఎం, డిప్యూటీ ఆర్ఎంపీ, ఆసిఫాబాద్ డీఎంలపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు మాట్లాడారు. బెదిరింపులకు పాల్పడుతున్న డీఎం విశ్వనాథ్‌తో పాటు ఆర్ఎం సులేమాన్, డిప్యూటీ ఆర్ఎం ప్రణీత్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆర్టీసీ డిపో ముట్టడి నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చిరంజీవి, సురేష్, రాకేష్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన విద్య అందించడంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ చైర్ పర్సన్ డాక్టర్ ఉమాభరద్వాజ్ అన్నారు. శనివారం మండలంలోని బూర్గుడ గిరిజన బాలికల డిగ్రీ కళాశాలను న్యాక్ మెంబర్ కో ఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ, సభ్యుడు డాక్టర్ చంద్రకాంత్, డిగాన్కర్, గిరిజన శాఖ ఓఎస్డీ నీరజ్‌సింహాతో కలిసి తనిఖీ చేశారు. గిరిజన కళాశాలలో వసతులతో పాటు నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట ప్రిన్సిపాల్ శారద, ఆర్సీఓ ఆగస్టీన్, ఐక్యుఏసీ కో ఆర్డినేటర్ కల్పన ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా, సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు నియమించిన ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, అదనపు ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి హాజరయారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రిసైడింగ్ అధికారి పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ప్రకియ సజావుగా సాగేలా పర్యవేక్షించాలని సూచించారు. ప్రిసైడింగ్ అధికారి డైరీపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. టెండర్, చాలెంజ్ ఓటుపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని చెప్పారు. అదనపు పోలింగ్ అధికారి పోలింగ్ క్లర్కులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ కంపార్టుమెంట్ ఏర్పాటు చేయాలన్నారు. ఉపయోగించిన బ్యాలెట్ పేపర్లు, ఉపయోగించని బ్యాలెట్ పేపర్ల వివరాలు నమోదు చేయాలని చెప్పారు. బ్యాలెట్ పేపర్లు వరుస సంఖ్యలో ఉండేలా చూడాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్‌లు, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫుడ్ సెఫ్టీ అధికారుల దాడులు

రెబ్బెన, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం ఫుడ్ సెఫ్టీ అధికారులు పలు హోటళ్లపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కాకతీయ, సాయిశ్రీ, మెహఫిల్ హోటళ్లలో తనిఖీ చేశారు. మెహిఫిల్ హోటళ్లలో నిల్వ ఉంచిన మాంసం, చికెన్ పలు తినుబండారాలు గుర్తించి నోటీసులు జారీ చేశారు.

దాడి కేసులో ముగ్గురి రిమాండ్

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అక్రం అనే వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిని శనివారం రిమాండ్‌కు తరలించినట్టు పట్టణ సీఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఫారూక్, సాదిక్, రాజిక్‌ను అదుపులోకి శనివారం కోర్టుకు తరలించామని తెలిపారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి

జైనూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లో మౌలక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్ కోరారు. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో శనివారం గ్రామ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో డీపీవో మాట్లాడారు. ఎండల తీవ్రత అధికమవుతున్న నేపథ్యం లో గిరిజన గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి ఎద్దడి తీవ్రత ఉన్న గ్రామాలను గుర్తించాలని చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో మోహన్, ఏపీవో నగేష్, ఈవో ఆనంద్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ గృహ నిర్మాణాలపై అవగాహన

సిర్పూర్(టి), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పైలట్ గ్రామమైన మేడిపల్లి పంచాయతీ పరిధిలో శనివారం ఇందిరమ్మ గృహ నిర్మాణాపై హౌసింగ్ డిప్యూటీ ఈఈ వేణుగోపాల్‌రెడ్డి అవగాహన కల్పించారు. రావన్‌పల్లి, లింబుగూడ, మేడిపల్లి గ్రామస్తులకు మార్చి 15 లోగా ఇందిరమ్మ ఇళ్ల బేసిమెంట్ వరకు పనులు పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణ, ఏఈఈలు తదితరులు ఉన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులపై దృష్టి సారించి పకడ్బందీగా పరిష్కరిం చాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం పోలీసు అధికారులతో నెలవారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కేసు నమోదు నుంచి చార్జీ షీట్ వరకు ప్రతీ విషయాన్ని పూర్తి స్థాయిలో పరిశోధన చేయాల న్నారు. అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్‌మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. అవసరమైతే సంబంధిత న్యాయాధికారులను స్వయంగా కలిసి కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పెండింగ్ కేసుల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. కొత్త కేసులతో పాటు చాలా కాలంగా పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా వేగంగా పరిష్కరించాలని ఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఏఎస్పీ చిత్తరంజన్, డీఎస్పీలు కరుణాకర్, రామానుజం, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పోడు భూముల జోలికొస్తే ఊరుకోం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రవీణ్‌కుమార్

బెజ్జూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలుగా పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులను అటవీ అధికారులు ముప్పు తిప్పలు పెడుతున్నారని, వారిని అడ్డుకుంటే ఊరుకోమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాపన్నపేట గ్రామంలో రైతులు గత 40 ఏళ్లుగా సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుంటే అటవీ అధికారులు ఆ భూముల్లో మొక్కలు నాటేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. గతంలో ఉన్న భూములే తప్ప రైతులు కొత్తగా సాగు చేయడం లేదన్నారు. అటవీ చట్టాలకు మేం వ్యతిరేకులం కాదని, అడవికి వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టకుండా ఫారెస్టు చట్టాలను గౌరవిస్తామని, పోడు భూముల జోలికి వస్తే మాత్రం ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. అలాగే మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు ఆక్రమించి భవన నిర్మాణాలు ఏర్పాటు చేసుకున్న రెవెన్యూ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు కొనసాగిస్తూ ప్రభుత్వ భూములను ధ్వంసం చేస్తున్న స్థానిక తహసీల్దార్, కలెక్టర్, ఇతర అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అలాగే సిర్పూర్‌లో వలస వాదుల కాలంలో ఈ ప్రాంతం పూర్తిగా అన్యాయానికి గురైందని తెలిపారు. కార్యక్రమంలో సారయ్య, తిరుపతి, మోహన్, ఇస్తారి, బాబా పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను విస్మరిస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రైతులు ఇబ్బందులు పడుతున్నా పట్టింపు లేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో 2014 నుంచి 2023 వరకు భూగర్భజలాలు అడుగంటిన పరిస్థితి రాలేదన్నారు. కాంగ్రెస్‌లో కుమ్మలాటలు, వర్గ పోరు పెరిగి పోయందని చెప్పారు. దీన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. తాను సిర్పూరు నియోజకవర్గ ప్రజలకు ఎప్పటికీ అండగా ఉంటానని , ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, నాయకులు రాజు, మినాజ్ పాల్గొన్నారు.

ప్రకృతిపై అవగాహన

● విద్యార్థులకు గో టు నేచర్ కార్యక్రమం




అటవీ ప్రాంతంలోని బేస్ క్యాంపును సందర్శించిన విద్యార్థులు

పెంచికలపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి ప్రకృతి వనరులపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశ్యంతో జాతీయ హరిత దళంలో భాగంగా జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో గో టు నేచర్ (ప్రకృతిలోకి వెళ్దాం) అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని గురువారం కాగజ్‌నగర్ డివిజన్ అటవీ శాఖ కార్యాల యంలో ఎఫ్‌డీఓ సుశాంత్ సుకుదేవ్, జిల్లా విద్యాధికారి గమనియాల్ ప్రారంభించగా శనివారం ముగిసింది. జీవవైవిద్యం అనగానే ముందుగా గుర్తొచ్చేది కాగజ్‌నగర్, పెంచికలపేట అడవులు, ఆహ్లాదకరమైన వాతావరణం, ఎత్తైన కొండలు, దట్టమైన అటవీ ప్రాంతం, వృక్ష శిలాజాలు కనువిందు చేస్తాయి. పొడుగు ముక్కు రాబందుల ఆవాసమైన పాలరాపు గుట్ట ఎన్నో వింతలు, విశేషాలను పంచుతోంది. వివిధ రకాల వన్యప్రాణులు, సుమారు 250 రకాల పక్షుల కిలకిల రావాలతో కళకళలాడుతోంది.

● అటవీశాఖ కార్యాలయంలో..

కాగజ్‌నగర్ డివిజన్ అటవీశాఖ కార్యాలయంలో గురువారం ప్రారంభమైంది. గో టు నేచర్ కార్యక్రమంలో జిల్లాలో వివిధ పాఠశాలలకు చెందిన 45 మంది విద్యార్థులు, 10 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గురువారం ప్రారంభమై కాగజ్‌నగర్ రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. శుక్రవారం ఉదయం పెంచికలపేట చేరుకున్నారు .అక్కడ నుంచి ఉదయం ఎల్లారు బొక్కివాగు ప్రాజెక్టు వద్ద వివిధ రకాల పక్షులను బైనేకులర్ల సహాయంతో విద్యార్థులు వీక్షించారు. వలస పక్షులు, స్థానిక పక్షుల వాటి జీవన శైలి, ప్రాముఖ్యతను ఎఫ్ఆర్వో అనిల్‌కుమార్ విద్యార్థులకు వివరించారు. అనంతరం అక్కడ నుంచి గుండెపల్లి అటవీ శాఖ బేక్ క్యాంపు చేరుకుని ముందుగా అడవులలో నడుస్తూ పెద్ద పెద్ద వృక్షాలను గమనిస్తూ పక్షుల కిలకిల రావాలను వింటూ ట్రెకింగ్‌ను విద్యార్థులు ఆస్వాదించారు. శనివారం కాగజ్‌నగర్ రేంజ్ పరిధిలోని కోసిని చెరువు వద్ద బర్డ్ వాచ్ కార్యక్రమం అనంతరం గో టు నేచర్ కార్యక్రమం ముగిసింది.

విద్యార్థులకు ప్రకృతిపై అవగాహన
- మధుకర్, జిల్లా సైన్స్ అధికారి



విద్యార్థులకు ప్రకృతిపై అవగాహన ఏర్పడింది. పలు రకాల జంతు, జీవ, వృక్ష జాతులను విద్యార్థులు తిలకించారు. అటవీశాఖా అధికారులు పక్షులు, వృక్ష జాతులపై వివరించారు.